నమస్తే తెలంగాణ

## ఆర్థికానికి యుద్ధ భయం

**ఉక్రెయిన్** యుద్ధం కారణంగా రష్యాపై గతేడాది పశ్చిమ దేశాలు మూకుమ్మడిగా ఆర్థిక ఆంక్షలు విధించాయి. ఈ పరిస్థితిని తనకను కూలంగా మలుచుకొని రష్యా నుంచి భారత్ చౌక ధరలకు చమురును దిగుమతి చేసుకుంటున్నది. మన దేశపు మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా 35 శాతానికి చేరింది. ఈ మారకం రూపాయి ద్వారా జరగడంతో భారత్‌కు మరింత లాభసాటిగా మారింది. అయినప్పటికీ భారత్ చమురు దిగుమతుల్లో పశ్చిమాసియా వాటా 45 శాతం మేర ఉంటున్నది. ఇందులో ఇరాక్ వాటా 21 శాతం, సౌదీ అరేబియా వాటా 18 శాతం. ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధం ప్రజ్వరిల్లుతున్నది. ఇజ్రాయెల్-హమాస్ భీకరపోరు ఎటుపోయి ఎటు తిరుగుతుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్, లెబనాన్, ఇతర దేశాలు ప్రత్యక్ష యుద్ధంలోకి దిగుతాయా? గాజాపై అణుబాంబు వేస్తామని ఇజ్రాయెల్ మంత్రి హెచ్చరించడంపై ప్రపంచం స్పందన ఎలా ఉంటుంది? ఇస్లామిక్ దేశాల వైఖరి ఏమిటి? ప్రస్తుతం ఈ ప్రశ్నలు పశ్చిమాసియాపైనే కాదు, ప్రపంచం ముందూ వేలాడుతున్నాయి. ఆ సంగతి అలా ఉంచితే ప్రస్తుత యుద్ధం ప్రభావం చమురు ధరలపై పడుతుందా? అనేది అతిపెద్ద ప్రశ్నగా ముందుకువచ్చింది. చమురు దిగుమతిలో, వినియోగంలో ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్న భారత్‌కు ఈ ప్రశ్న సహజంగానే ఆందోళన కలిగిస్తున్నది.

ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు గణనీయంగా పెరిగినా, ఇప్పటికీ పశ్చిమాసియా నుంచే అత్యధిక మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్నది. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల ఉద్రిక్తతలు పెరిగితే చమురు ధరలు పైపైకి పోయే ప్రమాదం ఉన్నది. అదే జరిగితే భారత ఆర్థికవ్యవస్థ కుదుపునకు గురయ్యే అవకాశం ఉన్నదని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇదేమీ నిరాధారమైన ఆందోళన కాదు. గాజా సంక్షోభం ముదురుతున్న కొద్దీ ఆయిల్ మార్కెట్లు ఉత్కంఠకు, ఒడిదుడుకులకు లోనవుతున్నాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) పేర్కొనడం గమనార్హం. యుద్ధం తీవ్రమైతే ద్రవ్యోల్బణం పెరుగుతుందని, దీనిపై దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సి రావచ్చని కూడా ప్రపంచ బ్యాంకు వర్ధమాన దేశాలను హెచ్చరించింది. ప్రధానంగా ఆహార ధరలపై, అంతిమంగా ఆహారభద్రతపై చమురు సంక్షోభం ప్రభావం పడుతుందని అప్రమత్తం చేయడం గమనార్హం.

ఉద్రిక్తతలు పెరిగితే చమురుతో పాటుగా అన్నిరకాల సరుకుల రవాణా కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా కూడా ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం భారత్‌కు పరీక్షగా మారుతున్నది. సంప్రదాయికంగా పాలస్తీనాకు మద్దతుగా నిలిచే భారత్ ఇజ్రాయెల్ వైపు మళ్లడంపై విస్మయం వ్యక్తమవుతున్నది. పశ్చిమాసియాలోని చమురుదేశాలు ప్రధానంగా ఇస్లాం మతానికి చెందినవేననేది తెలిసిందే. దాదాపుగా అవన్నీ కూడా ఇజ్రాయెల్‌కు బద్ధశత్రువులే. ఈ నేపథ్యంలో భారత్ దౌత్యపరంగా ఆచి తూచి అడుగులు వేయాల్సిన ఆవశ్యకత కనిపిస్తున్నది.

# రైతుల నడ్డి విరిచిందే కాంగ్రెస్

ఓ పదేండ్ల కిందట తెలంగాణ ప్రాంతంలో 'రైతు' అంటే ఆత్మహత్యలకు పర్యాయపదం. తెలంగాణ అంటే నెర్రెలిచ్చిన భూములు, డొక్కలెండిన రైతులకు కేరాఫ్ అడ్రస్. ఏటా విడుదలయ్యే నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో రిపోర్టులో ఆత్మహత్యల్లో తెలంగాణ రైతులే ఎక్కువగా ఉండేవారు. నాటి దుర్మార్గ నాయకుల పాలనకు నిదర్శనం ఇది.



వై.సతీష్‌రెడ్డి
96414 66666




అప్పుడు కూడా ప్రభుత్వాలున్నాయి, పార్టీలున్నాయి, పాలకులున్నారు. ఇప్పుడు మాకు ఒక్క అవకాశాన్నివ్వండి అంటూ వస్తున్న కాంగ్రెస్ పార్టీనే నాడు అటూ ఇటుగా ఐదారు దశాబ్దాల పాటు దేశాన్ని పాలించింది. ఇటు రాష్ట్రంలోనూ వారి పాలనే. ఊళ్లో కోడి కూత వినిపించని రోజులున్నాయేమో గానీ, రైతు ఇంట రోదనలు వినిపించని రోజులు మాత్రం లేవు. పంటకు పట్టిన చీడను చంపడానికి వేయాల్సిన తిమ్మట (థైమెట్) గోళీలు, ఎండ్రిన్ మందు రైతులకు నాడు ఆత్మహత్యా సాధనాలయ్యాయి. నాడు పదెకరాల భూమి ఉన్నా ఆ రైతు కటిక పేదవాడే. ఎందుకంటే అందులో ఎకరం పారేందుకు కూడా నీళ్లు లెవ్వు. వానలు పడితే కరెంటు కష్టాలు కన్నీరు పెట్టించేవి. అటు విత్తనాలు, ఎరువుల తిప్పలు రైతన్నను ఏడిపించని కాలం లేదు. వాటికోసం ప్రాణాలు పణంగా పెట్టాల్సిన పరిస్థితి. తలలు పగిలితే గానీ తట్టెడు ఎరువులు దొరకని దారుణ స్థితి. పంట చేతికిరాక పురుగు మందులే రైతులకు పెరుగన్నమైన రోజులవి. పేరుకే ఎరువులు, విత్తనాల సబ్సిడీలు. అసలు విత్తనాలు, ఎరువులే దొరకనప్పుడు ఆ సబ్సిడీలు ఇచ్చి ఏం ప్రయోజనం? పంట పెట్టుబడికి పైసలుండవు. వడ్డీ వ్యాపారుల దగ్గరికి వెళ్లి డబ్బులు తెచ్చినా అవి తిరిగికట్టే పరిస్థితి ఉండేది కాదు. ఆ అప్పు కింద ఇళ్లకు తాళాలేసిన రోజులు ఇంకా కండ్లముందే కదలాడుతున్నాయి. బ్యాంకోళ్లు వచ్చి అప్పు కింద ఇంట్లో సామాన్లు.. కరెంటోళ్లొచ్చి ఫ్యూజ్‌లు పీక్కొనిపోయిన రోజులు మనం చూడనివా? ఎటుచూసినా అన్నదాత ఆక్రందనలే తప్ప ఆనందంగా కనిపించిన రోజులు లేవు.

రైతులు పడ్డ ఇన్ని కష్టాలు కాంగ్రెస్ పాలనలోనే. అదే కాంగ్రెస్ ఇప్పుడు మళ్లీ వచ్చి రైతులకు అది చేస్తాం, ఇది చేస్తాం.. అంటూ ఆరు గ్యారంటీల పేర అలవిగాని హామీలిస్తున్నది. దశాబ్దాల పాటు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించినా రైతుల బతుకులను మార్చని కాంగ్రెస్ ఇప్పుడు మళ్లా అధికారంలోకి వచ్చి ఏం చేస్తుంది. సరైన టైంలో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలనే సోయి కాంగ్రెస్‌కు లేదు. అప్పుల కూపం నుంచి రైతుకు విముక్తి కల్పించే రైతుబంధు వంటి పథకాలకు రూపకల్పన చేయాలనే సోయి లేదు. అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి అవుతుంది కానీ, రైతుల పక్షపాతి ఎలా అవుతుంది? దశాబ్దాల పాటు దేశాన్ని పాలించినప్పుడే రైతులను పట్టించుకోనోళ్లు.. ఇప్పుడు ఒక్క తెలంగాణలో అధికారం ఇస్తే వారి బతుకులను బంగారుమయం చేస్తామని చెప్తున్న మాటలు మాయమాటలు కాకపోతే ఇంకేమవుతాయి?

మోసేవాడికే తెలుస్తుంది కావడి బరువు అన్నట్టు ఓ రైతుకే ఆ రైతు బాధేంటో తెలుస్తుంది. బ్లాక్ మెయిలర్లకు, బ్రోకర్లకు, పెట్టుబడిదారులకు, ప్రజల సొమ్మును నొక్కేసి, బ్యాంకులకు ఎగనామం పెట్టేసి వ్యాపారాలు చేసేవాళ్లకు తెలువదు రైతు బాధ. కేసీఆర్ స్వయంగా ఓ రైతు. అందుకే ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ఎక్కువగా శ్రద్ధ పెట్టింది వ్యవసాయరంగంపైనే. వచ్చీ రాగానే కరెంటు సమస్య తీర్చారు. నీళ్ల కష్టాలు తీర్చారు. ఇప్పుడు విత్తనాలు, ఎరువుల కోసం తిప్పలు లేవు. రైతులకు పంట పెట్టుబడి కష్టాలు లేకుండా, రైతన్నలు అప్పుల కోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరిగి ఆర్థికంగా చితికిపోకుండా రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చారు. కానీ, ప్రతీది డబ్బుల కోణంలోనే చూసే వ్యక్తి, డబ్బుల కోసం ఎంతకైనా దిగజారే వ్యక్తి రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి ఇవన్నీ ఏం తెలుసు? దేశానికి అన్నం పెట్టే రైతన్నను గౌరవించాలనే కనీస సోయి కూడా ఆయనకు లేదు. రైతుల గౌరవాన్ని పెంచేలా ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధును బిచ్చం అంటూ మాట్లాడి రైతులోకాన్ని అవమానపరిచాడు. రైతుబంధు రైతుల్లో ఆత్మస్థయిర్యాన్ని నింపింది.

రేవంత్‌రెడ్డికి మొదటినుంచి రైతులంటే చిన్నచూపే. ఉచిత కరెంటు విషయంలోనూ రైతులకు 3 గంటల కరెంటు సరిపోతుంది, 24 గంటలు ఎందుకంటూ రైతులపై తనకున్న అక్కసును ప్రదర్శించాడు. ఇప్పుడు రైతుబంధు విషయంలోనూ అదేవిధంగా ప్రవర్తిస్తున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులను నట్టేట ముంచడం ఖాయంగా కనిపిస్తున్నది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణే పొరుగున ఉన్న కర్ణాటక. అక్కడ కూడా ఇలాగే గ్యారంటీలని గప్పాలు కొట్టి ఇప్పుడు చేతులెత్తేసింది హస్తం పార్టీ. ఒక్కమాటలో చెప్పాలంటే పదేండ్ల కింద తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మనం ఎలాంటి దుస్థితిలో ఉన్నామో.. ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి అక్కడి రైతులు అదే దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మా కర్మగాలి కాంగ్రెస్‌కు ఓటేశామని కన్నడిగులే స్వయంగా చెప్తున్నారంటే హస్తం ఎప్పటికీ భస్మాసురహస్తమే కానీ, అభయ హస్తం కాబోదని మరోసారి తేటతెల్లమైంది.

ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగైంది. సాగునీటి పరవళ్లు, కరెంటు వెలుగులు, ధాన్యపు రాశులు తొణికిసలాడుతున్నాయి. ఇలాంటి తెలంగాణను తీసుకెళ్లి భస్మాసుర హస్తంలో పెడితే తెలంగాణ ఆగమవ్వడం ఖాయం. ఎందుకంటే రేవంత్‌రెడ్డి అనే వ్యక్తి తెలంగాణకు, తెలంగాణ రైతాంగానికి బద్ధ వ్యతిరేకి. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్నవారిని తుపాకీతో కాల్చి చంపుతానని ఉరికిన నీచుడు. ఉద్యమాన్ని ఉరకలెత్తించిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులను తాగుబోతులని అవమానించిన ఓ దురహంకారి. ఇలాంటి నాయకుల చేతిలోకి తెలంగాణ వెళ్తే రాష్ట్ర ప్రజలకు మిగిలేదేమిటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

(వ్యాసకర్త: రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ చైర్మన్)

# విజయానికి మ్యానిఫెస్టోనే గీటురాయి

ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలనుకునే రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు రాష్ట్ర బడ్జెట్‌ను అనుసరించి అభివృద్ధి సంక్షేమాలను ప్రజల ముందు మ్యానిఫెస్టోల రూపంలో వెల్లడిస్తారు. తద్వారా ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి సందర్భంలోనే ఆయా పార్టీల అసలైన స్వభావం ప్రజలు అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. అయితే ఆయా పార్టీల మ్యానిఫెస్టోలు.. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాలను సంతులితం చేస్తూ రూపొందించవలసిన అవసరం ఉంటుంది.



మల్లావజ్జల విజయానంద్
79895 25848

తెలంగాణలో తొలి ఎన్నికల నుంచి కూడా ఆయా పార్టీ లు సంక్షేమరంగానికి పెద్దపీట వేస్తూ పెద్ద మొత్తంలో సంక్షేమ పథకాలను ప్రకటించి ఎన్నికలకు వెళ్లాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ మిగిలిన అన్ని పథకాలు టీఆర్‌ఎస్‌తో సమానం గా ప్రకటించినా, రైతు రుణమాఫీ విషయంలో రూ.2లక్షల వర కు మాఫీ చేస్తామని ప్రకటించింది. కానీ, ప్రజలు టీఆర్‌ఎస్‌కే పట్టంగట్టారు. అయితే చాలామంది టీఆర్‌ఎస్ ప్రకటించిన సం క్షేమ పథకాల వల్ల రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడుతుందని, ఆ బడ్జెట్‌తో ఈ సంక్షేమ పథకాలు ఎవరూ ఇవ్వలేరని భావించారు, విమర్శించారు. కానీ టీఆర్‌ఎస్ అన్నిరకాల సంక్షేమ పథకాలను అమలు చేసింది.

రెండోసారి అధికారంలోకి టీఆర్‌ఎస్ వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, 24 గంటల ఉచిత విద్యుత్తు లాంటి పెద్ద ప్రాజెక్టులతో బడ్జెట్ అంతా ఖర్చయి తెలంగాణకు సమస్యలు తప్పవని, దానివల్ల సంక్షేమ పథకాలు నిలిచిపోవడమో లేదా ప్రాజెక్టులు ఆగిపోవడమో జరుగుతుందని అందరూ అనుకున్నారు. అయినా ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను కొనసాగించింది.




ఆ తర్వాత 2020లో వచ్చిన కరోనా సందర్భంలోనూ వీటిని ముందుకు తీసుకువెళ్లటం సాధ్యం కాదేమోనని భావించారు. వాస్తవంగా దేశమంతా ఆర్థికంగా అతలాకుతలమై ఆయా ప్రభుత్వాలు అనేక ఇబ్బందులు పడ్డ పరిస్థితి చూశాం. అయినప్పటికీ తెలంగాణలో వాగ్దానం చేసిన అన్ని ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు పూర్తిగా ప్రజలకందించి తెలంగాణలో ఒక సమర్థవంతమైన సుస్థిర పాలన అందించింది. అభివృద్ధి సంక్షేమ రాజకీయాలు సమర్థ వంతమైన పాలనకు గీటురాయి.

కరోనా ప్రభావంలో కూడా ప్రకటించిన పథకాలు, అభివృద్ధి పనులకు తోడు దళిత బంధులాంటి భారీ బడ్జెట్‌తో కూడుకున్న పథకాలను కూడా ప్రకటించి ప్రజలను, రాజకీయ పార్టీలను ఆశ్చర్యపరిచారు టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. దళితబంధు అందరికీ ఇవ్వరన్న ఆరోపణలను పటాపంచలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆ పథకాన్ని దశలవారీగా విజయవంతంగా అమలుచేస్తూ దేశమే ఆలోచించేలా చేశారు.

కరోనా లాంటి సంక్షోభ సందర్భంలో కూడా ఆర్థిక పురోగతి ఎలా సాధ్యపడింది. సంక్షేమ పథకాలకు సంపద ఎలా చేకూరిందని విశ్లేషిస్తే ఏవైతే ప్రజలను సోమరులను చేస్తున్నారని విమర్శలకులోనైన ఆ సంక్షేమ పథకాలే తెలంగాణలో ప్రజల వినియోగ స్థాయిని పెంచి పెద్దమొత్తంలో పన్ను చెల్లించేవారిగా చేసి తెలంగాణ ఆర్థికవ్యవస్థ పురోగమించేలా చేశాయి.

కేవలం ఎన్నికల తాయిలాలుగానే సంక్షేమ పథకాలు ప్రకటించి ఉంటే ఇలాంటి ఆర్థిక పరిపుష్టి రాకపోగా రాష్ట్రం మరింత వెనుకపడేది. కానీ, ఏ సంక్షేమ పథకం ప్రకటించినా అది ఆయా లబ్ధిదారుల జీవితాలకు ఒక స్వావలంబన అయ్యేవిధంగా పథకాల రూపకల్పన చేయడం వల్ల ఆయా పథకాలు ప్రజల సమగ్ర ఆర్థిక పరిపుష్టికి దోహదపడ్డాయి. అది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడింది. ఇలా సంపద సృష్టించడంతో పెరిగిన సంపదను తిరిగి పేదవర్గాల సముద్ధరణకు ఖర్చుచేయటం అన్న ఒక కొత్త పంథాను నిర్దేశించింది టీఆర్‌ఎస్ పార్టీ. ప్రస్తుత ఎన్నికలు పదేండ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్, బీజేపీలకు చాలా కీలకం కనుక ఆ పార్టీలు ఎన్నో వినూత్న పథకాలు ప్రారంభించబడ్డ తెలంగాణ గడ్డమీద తాము ఎన్నడూ ఎక్కడా అమలుచేయని పథకాలను మ్యానిఫెస్టోల్లో ప్రకటించి ముందుకువచ్చాయి. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు వాగ్దానాలను తలదన్నేలా ప్రజా ఆకర్షక మ్యానిఫెస్టోను రూపొందించి మూడోసారి ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధపడింది బీఆర్‌ఎస్.

రైతుబంధు పథకాన్ని రాబోయే ఐదేండ్లలో 16 వేలకు పెంచుతామని, ఉచిత విద్యుత్తును, ధాన్యం కొనుగోలును కొనసాగిస్తామని రైతులకు భరోసా కల్పించారు. రైతుబీమా ఉండనే ఉన్నది. కేసీఆర్ బీమా అందరికీ ధీమా అనే పథకంతో భూమి లేని కూలీలకు, కౌలు రైతులకు, పేదలకు కూడా ఒక భరోసా ఇస్తూ, ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.15 లక్షలకు పెంచడం పేదల ఆరోగ్యానికి ఒక గ్యారెంటీ ప్రకటన. వృద్ధులకు 5వేలు, వికలాంగులకు 6వేల వరకు ఆసరా పింఛను పెంచబోతున్నట్టు ప్రకటించి బలహీనవర్గాలకు భరోసా ఇచ్చారు. ముఖ్యంగా సమాజంలో సగంగా ఉన్న స్త్రీలకు ఆర్థిక స్వావలంబన కల్పించటం కోసం తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.3 వేలు ఇస్తామని బీఆర్‌ఎస్ ప్రకటించింది. ఇది అమలైతే సమాజంలో గొప్ప పురోగతిని చూడగలుగుతాం. ఈ మొత్తాన్ని మహిళలకు ఇవ్వటం వల్ల నూటికి నూరుశాతం సద్వినియోగమవుతాయి.

ఆ కుటుంబ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది. అదే బీఆర్‌ఎస్‌కు ఇతర పార్టీలకు పథకాల రూపకల్పనలో ఉన్న తేడా. బీఆర్‌ఎస్ రూపొందించిన పథకాలకు ఆర్థిక పురోగమన లక్షణాలు ఉండటం విశేషం. ప్రతి పథకం సామాజిక ఆర్థిక రుగ్మతలను రూపు మాపేదిగా ఉండేలా రూపొందించడం ఒక్క బీఆర్‌ఎస్‌కు మాత్రమే సాధ్యమైంది.

తెలంగాణ ప్రజలు కేవలం వాళ్లకేదో రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చి ఎక్కువ లబ్ధి చేస్తే చాలనుకునేంత అమాయకంగా ఉన్నారనుకోలేం. సంక్షేమ పథకాల ప్రకటనలే కాక వాటి సాధ్యాసాధ్యా లు వాటిని అమలుచేయగల అనుభవం, సత్తా ఉన్న నాయకుడు, పార్టీ, వారి పూర్వపు ఆచరణ అంత పరిశీలించకుండా ఉంటారనుకోవడం సాహసమే. కాబట్టే రాజకీయ నాయకులు ఏ అవకాశాన్ని, సందర్భాన్నీ నిర్లక్ష్యం చేయకుండా ప్రజల శాశ్వత పురోభివృద్ధికి కృషిచేయాలి. లేకుంటే రాజకీయ అధికారం అందని ద్రాక్షే అవుతుంది.

(వ్యాసకర్త:తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు)




## బీజేపీ ఓటమి తథ్యం

అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ తప్పకుండా ఓడిపోతుంది. ఇది లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపుతుంది. శివరాజ్ సింగ్ లాగా మోదీ కూడా వెళ్లిపోవాల్సి వస్తే.. దాని గురించి ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇవాళ దేశంలోని అన్ని వ్యవస్థలు దెబ్బ తిన్నాయి. ప్రజలు, రైతులు ఇప్పుడు మేల్కొన్నారు. ఈ దేశ రైతులంతా ఒక్కటై ఓటర్ల దగ్గరకు వెళ్లి ఈ రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వాన్ని ఓడించడానికి ఓటేయమని ఓటర్లను అడుగుతారు.

\- యోగేంద్ర యాదవ్,
రాజకీయాలు, ఎన్నికల విశ్లేషకుడు





## నీటిగుడిపై నీలాప నిందలా

'కాళేశ్వరం ప్రాజెక్టు' తెలంగాణ నిర్మించుకున్న దేవాలయం. ఆ గుడి మీద రాళ్లు విసురుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులారా.. మీ పతనం మొదలైంది. తెలంగాణ మిమ్మల్ని క్షమించదు. మా కంచంలో మట్టి పోయాలని చూసే మిమ్మల్ని తెలంగాణ సమాజం చెద పురుగుల్లా చూసే అవకాశం మీకు మీరే ఇచ్చుకున్నారు. నీచ, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దేవాలయ గోపురం లాంటి ప్రాజెక్టు మీదికెక్కి అబద్ధాల కథలల్లారు. స్లాబ్‌లు కొట్టుకోకుండా పెట్టుకొనే 'గ్యాప్'ను పగుళ్లుగా చూపిస్తూ పైశాచికానందాన్ని పొందారు.



రావులపల్లి సునీత
99857 99966

రాష్ట్రానికే కాదు, దేశానికి అన్నం పెడుతున్న దేవతను పరిహాస మాడి పరవశించారు. 'కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులు రెండూ ఎందుకూ పనికి రావు, కూలగొట్టాల్సిందే..' అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఒక ఛానెల్‌కు వచ్చి మాట్లాడుతున్నాడు. అవును, నిర్మించడం మీకేం తెలుసు, కూలగొట్టడమే తెలుసు. వీళ్ల ప్రకటించడం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మేమెక్కడ వెనకబడిపోతామోనని వెంటనే పరిశీలన బృందాన్ని పంపడం, మూడు రోజుల్లో వాళ్ల నివేదిక పంపడం.. ఆహా, ఎంత వేగం? ఎలక్షన్ టైం గనక వెంటవెంటనే తలా ఒక రాయి విసిరితే లాభం పొందవచ్చని ఇరు పార్టీల భ్రమ. మేడిగడ్డ కట్టిన ఎల్ అండ్ టీ సంస్థ పరిశీలించి దాన్ని సరిచేసే బాధ్యత తీసుకుంది. ఎల్ అండ్ టీ ఎన్నో పెద్ద నిర్మాణాలు చేసిన పేరున్న పెద్ద సంస్థ.

వీళ్ల పాలనాకాలంలో నిర్మించిన ప్రాజెక్టుల నిర్మాణాల్లో ఎంత మింగారో తెలువంది ఎవరికి? అదే పని సొంత రాష్ట్రాన్ని అద్భుతంగా నిర్మించుకుంటున్న మనమూ చేశామని నిందలు వేస్తే నమ్మేదెవరు? ఏదో మాయ చేసి కుర్చీ ఎక్కడానికి ఎంతకైనా దిగజారుతున్నారు కాంగ్రెస్ పార్టీ నాయకులు. కాంగ్రెస్ నాయకులు పవర్ కోసం ఎంతకైనా తెగిస్తారని గత చరిత్ర చెప్తున్నది. నగరంలో ఎన్ని హత్యలు జరిగేవి. రక్తమోడిన రోడ్లు, ఎన్నో కన్నీటి గాథలు. వీళ్ల అధికార దాహానికి ఉన్న సీఎం అసమర్థుడనీ, అశాంతిని అరికట్టలేకపోతున్నాడని నిరూపించడానికి రోడ్లపక్కన పళ్లమ్ముకునే వాళ్లనీ, కూరగాయలమ్ముకునే వాళ్లనీ కత్తులతో పొడిచి పొడిచి చూపించి హిందూ, ముస్లిం గొడవలుగా ప్రచారం చేయించేవాళ్లు. ఢిల్లీ అధిష్ఠానానికి నివేదికలు పంపి ఉన్న సీఎంను దించే కల్చర్ వీళ్లది. ఎప్పుడు కర్ఫ్యూ అంటారో తెలీక భయంతో చచ్చేవాళ్లు ప్రజలు. అన్నెం, పున్నెం ఎరుగని పేదలెందరో వీళ్ల క్రూరత్వానికి బలయ్యారు.

కృత్రిమంగా ప్రభుత్వ వ్యతిరేక వేవ్ సృష్టించి అధికారంలోకి వచ్చేస్తున్నట్టు హంగామా చేస్తున్నారంటే కారణం మన తెలంగాణ ఆదాయం పెరగడం. ఆదాయం తక్కువున్న రోజుల్లోనే ప్రత్యేక విమానాల్లో ఢిల్లీ పెద్దలకు సంచుల నిండా, సూట్కేసుల నిండా నోట్ల కట్టలు మోసి వాళ్ల పదవులను భద్రపరచుకున్న చరిత్ర కాంగ్రెస్ నాయకులది. ఇప్పుడు మనం పెంచుకున్న ఆదాయం మన రాష్ట్రాభివృద్ధికీ, పేద ప్రజల సంక్షేమానికి వాడుకుంటున్నాం, ఎదుగుతున్నాం. పల్లెల్లో వేదన లేని జీవనం గడిపే స్థాయికి వచ్చాం. మూటలు విమానమెక్కే రోజులు లేవు ఇప్పుడు. ఢిల్లీలో ఉన్న జాతీయపార్టీల చూపంతా మన ఆదాయం మీదే. నిండుగా ఉన్న మన కంచంలో మట్టి కొట్టడానికి అందరూ ఏకమై వస్తున్నారు. 'పొరపాటున మనం గెలవకపోతామా, ఈ భాండాగారాన్ని కొల్లగొట్టకపోతామా' అని ఊహల పల్లకీలో ఊరేగుతున్నారు. మనం అధికారంలోకి వచ్చేస్తున్నామని అవకాశవాదులకు ఆశలు పుట్టిస్తున్నారు.

తిని కడిగిన చెయ్యిని కూడా ప్రేమతో ముద్దాడే సంస్కారం తెలంగాణ ప్రజలది. తమ జీవితాల్లోకి నక్కలు చొరబడాలని చూస్తే తరిమి తరిమి కొట్టే సాహస చరిత్ర తెలంగాణది. రాష్ట్రాన్ని, ప్రజలను ప్రేమతో కాపాడుకునే బాహుబలి లాంటి 'బాపు' కేసీఆర్. ఆయన ముందు కుప్పిగంతులేస్తున్న కుక్కమూతి పిందెలు ఈ కాంగ్రెస్ మరుగుజ్జులు. విజయం ఎవరివైపో విడిగా చెప్పనక్కర్లేదు. అభ్యర్థులను ప్రకటించి మన బాహుబలి బాపు రాష్ట్రమంతా తిరుగుతుంటే.. కాబోయే ఎమ్మెల్యేలు జనంలో మమేకమై కదులుతుంటే.. వాళ్లింకా అభ్యర్థులను వెంపర్లాడుతున్నారు. గొడవలు పడి, క్యాడర్ మల్లయుద్ధాలు.. అంతా గందరగోళ పరిస్థితులే. అది ఆ పార్టీల పరిస్థితిని కళ్లకు కడుతున్నది. ఏదేమైనా పోరాడి తెచ్చుకున్న తెలంగాణ, తపన పడి నిర్మించుకుంటున్న తెలంగాణలో దొంగలు పొరపాటున దూరినా ప్రమాదమే. రాష్ట్రాన్ని ప్రేమించే ప్రతి పౌరుడూ అప్రమత్తంగా ఉండవలసిన తరుణమిది. దొంగలకు 'దొంగ' తెలివి ఎక్కువ. మన పచ్చని వనంలో రాకాసి జాతి చొరబడి చిందర వందర చేయ్యాలనుకుంటే పులుల్లా విజృంభించాల్సిందే. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా, ఎన్ని కుట్రలు కుయుక్తులు పన్నినా.. చివరికి జనమే గెలుస్తారు. తెలంగాణను గెలిపిస్తారు.